
పసుపులేటి నాగమల్లిక
79813 64632

# సాహిత్య శిల్పి బాపిరాజు



**అడవి బాబిరాజు**
కనువెలుగు: 8 అక్టోబరు 1895
కనుమరుగు: 22 సెప్టెంబరు 1952

**మన** తెలుగుజాతి గర్వించదగ్గ వారిలో శ్రీ అడవి బాపిరాజు గారు ఒకరు. ఈయన గొప్ప చిత్ర కారుడు,నవలాకారుడు, కథకుడు, నాటకకర్త, వ్యాసకర్త, వక్త, జాతీయవాది, పత్రికా సంపాదకుడు, ఉత్తమ అధ్యాప కుడు, న్యాయవాది, నటుడు, అన్నింటికీ మించి ప్రప్రథమంగా తెలుగు సినీ చలన చిత్ర రంగాన కళాదర్శకత్వం చేపట్టిన కళాతపస్వి, బహుముఖ ప్రజ్ఞాశాలి. కళారాధనకే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు. కవిత్వంతోపాటు, సంగీత నాట్యాలలో కూడా పరిచయమున్న గొప్ప కళాకారుడాయన.

శ్రీ బాపిరాజు గారు 1895 అక్టోబరు 8వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని సరిపల్లె గ్రామంలో జన్మించారు. భీమవరం, నరసాపురంలో హైస్కూలు చదువు పూర్తయ్యాక, రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో బి.ఏ. డిగ్రీ చేశారు. ఆనాటి కళాశాల ప్రిన్సిపాల్ ఆస్వాల్డ్ కూల్డ్రే ఆంగ్ల భాషా కోవిదుడేకాక, ఆంగ్లంలో గొప్ప కవి, చిత్రకారుడు కూడా. శ్రీ బాపిరాజు కళాజీవితానికి నాందీ ప్రస్తావన చేసింది ఆ కళాశాల ప్రిన్సిపాల్ 'కూల్డ్రే' అని శ్రీ బాపిరాజు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తనపై ప్రత్యేక శ్రద్ధ కన్పరిచేవారని, ఎంతో ఆత్మీయతతో బోధిస్తూ, కళాదృష్టి ప్రసాదించారని శ్రీ బాపిరాజు అనేవారు. 'కూల్డ్రే' ప్రోత్సాహంతోనే చిత్రకారుడిగా రాణించానని ఆయన చెప్పుకున్నారు. బి.ఏ. డిగ్రీ పూర్తయ్యాక కొంతకాలం జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత మచిలీపట్నంలోని జాతీయ కళాశాలలో చేరి శ్రీ ప్రమోద కుమార చటర్జీ వద్ద చిత్రలేఖనం అభ్యసించారు. శిల్పకళలోనూ, చిత్రలేఖనంలోనూ అనేక మెళకువలను చటర్జీ వద్ద శ్రీ బాపిరాజు నేర్చారు. ఆ తర్వాత మద్రాసులోని 'లా' కళాశాలలో న్యాయశాస్త్రంలో బి.ఎల్. పట్టా పొంది స్వగ్రామం భీమవరంలో న్యాయవాద వృత్తి చేపట్టారు. అయితే సుమారు ఏడాది కాలం మాత్రం న్యాయవాదిగా పనిచేసి, 1935లో బందరు జాతీయ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేరారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా తన గురువు కూల్డ్రే మహాశయుని ఆదర్శంగా సుమారు నాల్గు సంవత్సరాలు బందరు జాతీయ కళాశాలలో పనిచేశారు.

ఆ తర్వాత తెలుగు చలనచిత్ర రంగంలో కళాదర్శకునిగా శ్రీ సి. పుల్లయ్య నిర్మించిన 'సతీ అనసూయ', 'ధ్రువ విజయం' 'మీరాబాయి' చిత్రాలకు కళాదర్శకత్వం నిర్వహించారు. ఆ రకంగా తెలుగు చలనచిత్ర రంగంలో తొలి కళాదర్శకులుగా శ్రీ బాపిరాజు మంచిపేరు సంపాదించారు. చలనచిత్ర నిర్మాణం తొలిరోజుల్లో 1930 ప్రాంతంలో ప్రత్యేకించి కళాదర్శకులంటూ వేరే ఉండేవారు కాదు.ఆ లోటును తొలిసారిగా కళానిధి శ్రీ బాపిరాజే తీర్చారు. అంతేకాదు, కళాదర్శకత్వానికి శ్రీ బాపిరాజు ఒక ప్రత్యేకస్థానం, గుర్తింపుతోపాటు, నేటి పలువురు కళాదర్శకులకు ఆదర్శంగా నిల్చారు.

అయితే, చిత్రరంగాన ఎక్కువకాలం స్థిరపడక, హైదరాబాద్ నుండి వెలువడే 'మీజాన్' దినపత్రిక సంపాదక బాధ్యతలు చేపట్టారు. తెలంగాణా ప్రాంతంలో ఆనాడు (1943) మీజాన్ పత్రికకు విశేష సంఖ్యలో పాఠకులుండేవారు. ఈ పత్రికలో 1943 నుండి1946 వరకు సంపాదకులుగా పనిచేశారు. వీరికి రచయితగా మంచిపేరు తెచ్చిపెట్టింది మీజాన్ పత్రికనే చెప్పాలి. శ్రీ బాపిరాజు తాను రాసిన నవలలు- కోనంగి, గోనగన్నారెడ్డి, నారాయణరావు, హిమబిందు, అడవి శాంతిశ్రీ, తుపాను, వీటిలో కొన్నింటిని మీజాన్ పత్రికలో సీరియల్స్‌గా రాస్తూ, ఆ తర్వాత పుస్తకరూపంలో ప్రచురించారు. పత్రికారంగంలో ఎందర్నో ఉత్తమ జర్నలిస్టులుగా వీరు తీర్చిదిద్దారు. పత్రికా రచనలో నూతన విధానాలకు శ్రీకారం చుట్టారు. అయితే, నిజాం నిరంకుశపాలన, రజాకారుల దుండగాలను వ్యతిరేకిస్తూ, పత్రిక సంపాదకత్వాన్ని వదలి, గుంటూరులో కళాపీఠాన్ని నెలకొల్పారు. ఇక్కడ ఎందరికో చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు.

బాపిరాజుగారి చిత్రాలలో 'శబ్దబ్రహ్మ' భాగవత పురుష, సూర్యదేవ, సముద్రగుప్తుడు, రాధాకృష్ణ, గౌరీశంకరులు, శశికళ, మృత్యుంజయుడు, నటరాజు ఆనంద తాండవం, నాగనృత్యం, తిక్కన, మీరాబాయి ఇలా అనేకం ప్రముఖమైనవి. శ్రీ బాపిరాజు విశ్వనాధ వారి కిన్నెరసాని పాటలకు, నండూరి వారి ఎంకి పాటలకు చక్కని రేఖాచిత్రాలు గీసి ఆ గీతాలకు జీవం పోశారు. బాపిరాజుగారి శబ్దబ్రహ్మ చిత్రం డెన్మార్కులోని చిత్రప్రదర్శనశాలలో, పదిల పరచబడింది. భాగవత పురుష చిత్రం,తిరువాన్కూరులోనూ, సూర్యదేవ చిత్రం బీహార్‌లో, ఇలా అనేక చిత్రాలు పలు ప్రముఖుల ఇళ్ళలో అలంకరణాలుగా

తరువాయి 47వ పుటలో....

సందేహం లేదు. దీనికి తోడు భాషా సంస్కరణలో కూడా బ్రౌన్ తనదైన ముద్ర వేశాడు. బ్రౌన్ కృషి వల్ల ఆనాడు తెలుగులో ముద్రణ వికాసం చెంది ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. తెలుగు భాషలో హల్లులు రాసేటప్పుడు చ – చ, జ – జ లు రాసేవారు. చంద్రుడు –చందమామ, జడ–జల్లెడ. ఈ అక్షరాలపైన 1,2 అని వేసేవారు. ఈ స్వల్ప భేదం అనవసరం అని తొలగించాడు. అలాగే ర–ఱ భేదాలు క్ర–కృ భేదాలు సరిచేశాడు. అర్థానుస్వారము పూర్ణానుస్వార విషయంలోని క్లిష్టతను తొలగించాడు. 1836లో ముద్రితమైన రావిపాటి గురుమూర్తి శాస్త్రి తెలుగు వ్యాకరణంలోని ప్రయోగాలను సరిచేసిన దానికి పండితులు కొంతమంది విమర్శించారు. తర్వాత వాటి ఉపయోగాలను విస్మరించి వాళ్ళే సరయిన మార్గం ఎంచుకున్నారు. భాషా సంస్కరణలో ముఖ్యంగా గమనించవలసినది విరామ చిహ్నాలు. **బ్రౌన్ అనంతరమే మనకు తెలుగులో విరామ చిహ్నాలు, పుట సంఖ్యలు, అధ్యాయాలు, ఆశ్వాసాలు, భాగాలు మొదలయిన విభజన కనిపిస్తుంది.** తెలుగు వ్యాకరణ రచన 1840లో తొలిసారి అచ్చయింది. బ్రౌన్‌కి పూర్వమే ఎడి కాంబెల్ రచించిన A Grammar of the Telugu language, విలియం బ్రౌన్ రాసిన A Grammar of the Gentoo language,, బాగా ప్రసిద్ధి చెందాయి. దానికో కారణం ఉంది. ఈరెండు వ్యాకరణాలు పండితుల ప్రశంసకు పాత్రమైనవే తప్ప ప్రయోజనం అంతగాలేదు. 1814లో కేరీ ముద్రించిన Grammar of the Telinga Language తెలుగు సంస్కృత జన్యమని ఢంకాభజాయించాడు. అది పండితుల మన్నన కాని, ప్రజల ఆదరణకాని పొందలేదు (ఈ ప్రతి National Library కలకత్తాలో ఉంది).

ఇన్ని ప్రతికూల ప్రతుల మధ్య బ్రౌన్ వ్యాకరణం 12 భాగాలుగా విభక్తమయింది. మొదటి పదిభాగాలు వ్యాకరణాంశాలు పద కొండవభాగం ఛందస్సు. 12వ భాగం కళ, ద్రుత ప్రకృతి కావ్యాలకు సంబంధించిన ఉదాహరణలతో వివరించాడు. **బ్రౌన్ సంస్కృతాంధ్రభాషల సంబంధమే చెప్పాడు తప్ప జన్యజనక సంబంధమనలేదు. ఇంగ్లీషు వ్యాకరణాలు తొలినాళ్ళలో లాటిన్‌లోనే రాశారు. అలాగే తెలుగు వ్యాకరణము సంస్కృత విధానంలోనే వచ్చాయన్నాడు.** (A Grammar of the Telugu Language by CP Brown 1857 Page VI ). దీనికి తోడు బ్రౌన్ వ్యావహారిక భాషకే పట్టం కట్టాడు. కొన్ని సందర్భాల్లో 1746లో వెలువడిన Benzamin Schultze రచనలు, 1728 షూల్జ్ వ్యాకరణం Grammatica Telugica లలోని ఉదాహరణలు వ్యావహారిక భాషలోనే ఉన్నాయని అది ప్రజల భాష అనీ అన్నాడు. తెలుగులో ఉన్న యతిప్రాసల ప్రస్తావన చేస్తూ గోతిక్ (Gothic) భాషలోనూ శబ్ద సౌందర్యం కోసం అక్కడక్కడా ఇలా ప్రయోగించడం సహజమన్నాడు. స్పానిష్ భాషలో కూడా ఈ పద్ధతి ఉందని పేర్కొన్నాడు. (పుటలు 314–315) అన్ని విధాలుగా తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని తీర్చి దిద్దిన బ్రౌన్ మహాశయుడు ఆంధ్ర బంధు, వాఙ్మయోద్ధారకుడు, ధన్యజీవి, కారణ జన్ముడు మొదలయిన బిరుదు వాచకాలు అనేవి ఇంకా తక్కువేమో.

**(నవంబర్ 10 సి.పి. బ్రౌన్ జన్మదినోత్సవం. ఆయన పుట్టి 225 సంవత్సరాలు)**

–తరువాయి వచ్చే సంచికలో

**38వ పుట తరువాయి...**

# సాహిత్య శిల్పి బాపిరాజు....

శోభనిస్తున్నాయని బాపిరాజు గారి అభిమానులు పేర్కొంటారు.

బాపిరాజు గారి తిక్కన్న చిత్రం ఆంధ్ర విశ్వ కళాపరిషత్ బహుమతి పొందింది. వీరు సింహళం వెళ్ళి, అక్కడి సిగీరియా కుడ్య చిత్రాల్ని చిత్రించారు. అవి మద్రాసులోని ప్రభుత్వ మ్యూజియంలో ఉన్నాయి. కేవలం చిత్రాలు గీయడమే కాకుండా, సామాన్యులలో సైతం చిత్రకళపై అభిరుచి కలిగేలా అనేక పట్టణాలలో చిత్రకళపై ఉపన్యాసాలు ఇచ్చి, చిత్ర కళాభివృద్ధికి కృషిచేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక పత్రిక స్థాపించాలని ఆశించినా, ఆ ఆశయం ఫలప్రదం కాకుండానే శ్రీ బాపిరాజు కన్నుమూశారు.

వీరి కథలు రాగమాలిక, అంజలి, తూలికానృత్యం, తరంగిణి, భోగీయలోయ తదితర కథలు భారతి, మీజాన్ పత్రికలలో ప్రచురితమయ్యాయి. కథల్లో ప్రకృతిలోని యావత్తు సౌందర్యాన్ని దర్శింపజేస్తారాయన. వీరు గేయరచయితగా 'శశికళ'ను తన ఆరాధ్యదేవతగా అనుక్షణం అన్వేషిస్తూ ఎన్నో ప్రేమ, భక్తి పూర్వక భావగీతాలను రాశారు. శశికళ గేయాలు ఆకాశవాణిలో తరచూ ప్రసారమౌతాయి. 'పాడకే నా రాణి పాడెదను నీకునై పాటలను దేవి' ఈ గేయం – ఘంటశాల వారి గళంలో సాహితీప్రియుల, ఆకాశ వాణి శ్రోతల అభిమానాన్ని చూరగొన్నది.

శ్రీ బాపిరాజు 1949–50 ప్రాంతాల్లో ఆకాశవాణి విజయవాడ కేంద్ర సలహాదారుడిగా పనిచేశారు. ఆ కాలంలో తన నవల 'నారాయణరావు' రేడియో నాటకీకరణచేసి, అందులో జమీందారు పాత్రను తానే స్వయంగా పోషించి, నటుడిగా, రేడియో శ్రోతల అభిమానాన్ని కూడా పొందారు. అలాగే శైలబాల, భోగీయలోయ, ఏరువాక, తదితర రేడియో నాటకాలను శ్రీ బాపిరాజు రూపొందించారు. **1920 తర్వాత అడవి బాపిరాజులాంటి అనన్య ప్రతిభాపాటవాలు గల మహోన్నత వ్యక్తి ఆంధ్ర సాహిత్య సాంస్కృతిక చరిత్రలో లేదని సాహిత్య పరిశోధకులు భావిస్తారు.**

అడవి బాపిరాజు గారి ఇంటిపేరు అడవి గానీ, ఆయన మాత్రం సాహిత్య నందనవనం అని ఆయన సమకాలీనుడు 'కరుణశ్రీ' ఒక సందర్భంలో బాపిరాజుగారి గురించి వ్యాఖ్యానించారు. అలాగే, శ్రీ బాపిరాజు గీసిన గీత బొమ్మవుతుంది. అతడు పల్కిన పలుకు పాటవుతుందని ప్రముఖ కవిపండితులు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ అన్నారు. కల్లాకపటం, మాయామర్మం ఎరుగని వాడుగా, మిత్రులందరికీ తలలో నాల్కలా, పిల్లల్లో పిల్లవాడిగా, పెద్దల్లో పెద్దగా, ఆత్మీయుడిగా అందరిచేత 'బాపిబావ'గా పిలిపించుకుంటూ అందరివాడుగా జీవితం గడిపిన శ్రీ బాపిరాజు తన కళాప్రపంచాన్ని వదలి 1952 సెప్టెంబరు 22న గుండెపోటుకు గురై కీర్తిశేషులైనారు. తెలుగు సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించిన శ్రీ బాపిరాజు రాసిన గ్రంథాలు,గీసిన చిత్రాలు మాత్రం కళాభిమానులకు, కళాకారులకు ఎంతో ఆదర్శం.ఇంతటి కీర్తి గడించిన వీరు తెలుగు వారికి సదా చిరస్మరణీయులు.

వ్యాసరచన– తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రామచంద్రపురం, కోనసీమ జిల్లా.

ఈ సంచిక మూడవ అట్ట(51వ పుట) కూడా చూడండి